## క్లుప్తంగా

### కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

**చర్లరూరల్:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టి అమలుపరుస్తున్న సంక్షేమ పథకాలపై ఆదివారం చర్ల గ్రంథాలయ ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా పోస్టల్, హెల్త్, బ్యాంక్, గ్యాస్ సంస్థల అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో చర్ల పోస్టు మాస్టర్ కనకాచారి, సిబ్బంది వెంకటేశ్వర్లు, దుర్గా ప్రసాద్, పవన్, చంద్ర శేఖర్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### సంతలో అన్నదానం

**చర్ల:** చర్లలో ఆదివారం జరిగే వారపు సంతకు సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న ఆదివాసీలకు 'మీ కోసం మేమున్నాం' సభ్యులు అన్నదానం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ ఆదివారం కూడా నిమ్మగడ్డ ఆనంద్ కుటుంబ సభ్యులు అందించిన ఆర్థిక సాయంతో 200 మందికి అన్నదానం చేశారు. చర్లలోని గాంధీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని మీ కోసం మేమున్నాం టీం ప్రతినిధి నీలి ప్రకాశ్ ప్రారంభించి మాట్లాడారు. నిమ్మగడ్డ శ్రీమన్నారాయణ దంపతులు, ముమ్మనేని అరవింద్, దొడ్డా ప్రభుదాస్, దొడ్డి తాతారావు, దొడ్డి సూరిబాబు, దొడ్డి రామణారావు, మర్ల ప్రసాద్, రవి, రమణ, చారి పాల్గొన్నారు.

### సోలార్ లైట్లు పంపిణీ



సోలార్ లైట్లు పంపిణీ చేసిన సంస్థ బాధ్యులు

**అశ్వారావుపేటరూరల్:** మండలంలోని మారుమూల అటవీ ప్రాంతంలో ఉన్న చెన్నాపురం గ్రామ ఆదివాసీ గిరిజన కుటుంబాలకు సోలార్ లైట్లను అందించారు. ఆదివారం ఏపీలోని ఏలూరు జిల్లా కొయ్యలగూడేనికి చెందిన ఓ క్రిస్టియన్ సంస్థ డైరెక్టర్ దేవసహాయం ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన మొత్తం 27 కుటుంబాలకు ఈ సోలార్ లైట్ల కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకొక్క సోలార్ కిట్టు రూ.3,200 చొప్పున మొత్తం రూ.86,400 విలువగల సోలార్ లైట్లను ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది ప్రేమ కుమారి, జక్కుల రాంబాబు, వెస్లీ, తాటి సురేష్, క్రిష్, సువార్త రాజు పాల్గొన్నారు.

### గుంతను పూడ్చిన కానిస్టేబుల్



గుంతను పూడ్చుతున్న జాన్‌పాషా

**అన్నపురెడ్డిపల్లి:** రహదారిపై ఉన్న గుంతను పూడ్చి పలువురికి ఆదర్శంగా నిలిచాడు కానిస్టేబుల్. మండలంలోని అబ్బుగూడెం గ్రామ శివారులో అన్నపురెడ్డిపల్లి–పెనగడప ప్రధాన రహదారిలో ఉన్న కల్వర్టుపై ఏర్పడిన గుంతను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ జాన్‌పాషా ఆదివారం మట్టితో పూడ్చాడు. గత కొంతకాలంగా కల్వర్టు పై గుంత ఏర్పడి ప్రమాదభరితంగా మారింది. దీనితో ప్రమాదాలు సంభవించకుండా గుంత ఏర్పడిన ప్రదేశంలో వాహనదారులకు కనిపించే విధంగా కర్రకు ఎర్రటి గుడ్డను కట్టి ఉంచారు. ఆదివారం ప్రమాదభరితంగా ఉన్న గుంతను, కర్రను కానిస్టేబుల్ జాన్‌పాషా గమనించి మట్టి, రాళ్లతో గుంతను పాక్షికంగా పూడ్చాడు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే శాశ్వతంగా గుంతను పూడ్చాల్సిందిగా వాహనదారులు కోరుతున్నారు.

### దుస్తుల పంపిణీ



ఆదివాసీలకు దుస్తులు అందజేస్తున్న సీఐ రాజగోపాల్, దాతలు

**చర్ల:** కొత్తగూడెం పట్టణానికి చెందిన శ్రీనివాస వస్త్రాలయం, పద్మావతి సిల్క్స్ యజమానులు మోరిశెట్టి భవాని ప్రసాద్, మోరిశెట్టి నర్సింహారావులు వారి తల్లిదండ్రులు పూర్ణయందర్ రావు–సుధల జ్ఞాపకార్థం సుమారు రూ.2 లక్షల విలువ చేసే దుస్తులను మండలంలోని పలు గ్రామాల ఆదివాసీలకు పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని వనవాసీ కల్యాణ పరిషత్ కొమరంభీం విద్యార్థి నిలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో చర్ల సీఐ బి.రాజగోపాల్ పాల్గొని వస్త్రాలను అందించారు. దాతలు ఆదివాసీలకు అందిస్తున్న దాన గుణం గొప్పదని అన్నారు. భవాని ప్రసాద్, అనీష్‌కుమార్, కొత్తగూడెం వాసవీక్లబ్ అధ్యక్షుడు గుబ్బా శ్యాంగోపాల్, వాసవీ వనిత విజయం కొత్తగూడెం క్లబ్ అధ్యక్షురాలు గుబ్బా భార్గవి, సభ్యులు, వనవాసీ కల్యాణ పరిషత్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రాణాలకు గ్యారెంటీ ఏది?

- కాలువ కట్టమీదే రహదారి నిర్మాణం
- దశాబ్దాల నాటి వంతెనపై రాకపోకలు
- ఇరుకైన మార్గం.. విరిగిపోయిన రైలింగ్‌లు
- తరచూ చోటుచేసుకుంటున్న ప్రమాదాలు



రైలింగ్‌లు విరిగిపోయి శిథిలావస్థలో ఉన్న వంతెన



తాలిపేరు కాలువ గట్టుపై ప్రమాదభరింతగా ఉన్న ఇరుకు రహదారి

**చర్ల:** ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలు హరీ అన్న చందంగా మారింది ఆర్ కొత్తగూడెం–కుర్నపల్లి మార్గం. రోడ్డయితే నిర్మించారు గాని ఆ మార్గంలో చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. కోట్లాది రూపాయలతో పనులు చేసినప్పటికీ ఆ మార్గంలో ప్రయాణించే వాహనాదారులకు రక్షణ లేకుండా చేసిన పలువురు అధికారుల తీరుపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

చర్ల మండలంలోని ఆర్ కొత్తగూడెం నుంచి చింతగుప్ప, బోదనెల్లి గ్రామాల మీదుగా కుర్నపల్లికి రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో పదేళ్ల క్రితం 11.600 కిలోమీటర్ల రహదారిని రూ 13.54 కోట్లతో నిర్మించారు. అయితే ఈ రహదారిని నిర్మించే సందర్భంలో అధికారుల పర్యవేక్షణలోపం, బాధ్యతా రాహిత్యంతో ప్రయాణికులకు ఎదురుకానున్న ప్రమాదాలను గుర్తించలేదు. దానవాయిపేట–చింతప్ప మధ్యలో ఉన్న తాలిపేరు ప్రధాన కాలువ పక్క నుంచి రోడ్డును నిర్మించాల్సిన ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా తాలిపేరు ప్రధాన కాలువ కట్టపైనే నిర్మించారు. అయినప్పటికీ కాలువ కట్టను కొంత వెడల్పు చేసి ఉన్నట్లైతే ఇబ్బంది తప్పేది. కానీ అవేవీ పట్టించుకోకుండా ఖర్చు తగ్గి డబ్బు మిగుల్చుకోవచ్చునన్న ఉద్దేశ్యంతో కాలువ కట్టపైనే విల్‌మిక్స్ వేసి బీటీ వేసి మమ అనిపించారు. దీంతో రహదారిగా ఉన్న కాలువకట్టపై ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా మారింది. పైగా తాలిపేరు కాలువ దాటి ముందుకు వెళ్లే సందర్భంలో కాలువపై వంతెన నిర్మాణం చేయల్సి ఉండగా.. అలా చేయకుండా అప్పటికే ఇరిగేషన్‌శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన వంతెన వద్దకు రోడ్డును చేర్చారు. దానిపై నుంచే రాకపోకలు సాగేలా ఏర్పాట్లు చేశారు. అప్పటికే ఆ వంతెన నిర్మించి మూడు దశాబ్దాలైంది. దీంతో ప్రస్తుతం దానిపై నుంచి ప్రయాణం కూడా ప్రమాదబరితంగా తయారైంది. మరోవైపు, కాలువ కట్ట మీద నిర్మించిన రహదారి సుమారు 150 మీటర్లు ఉండగా దీనికి మధ్యలో కాలువ ఎగువన ఉన్న అటవీ ప్రాంతం నుంచి వచ్చే వర్షపు నీరు దిగువకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా కాలువ కింద నుంచి చిన్నపాటి వంతెన ఏర్పాటు చేయగా.. ఆ ప్రాంతంలో అది కేవలం 10 అడుగుల మేర మాత్రమే వెడల్పు ఉంది. దీంతో ఇక్కడా ప్రమాదాలకు నిలయంగా మారింది.

**ప్రమాదాలు అనేకం..**

కాలువ గట్టుపైన రోడ్డు ఇరుకుగా ఉండగా ఆ ప్రాంతం మీదుగా ప్రయాణించే ద్విచక్రవాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు అదుపు తప్పి అటు కాలువలోగాని ఇటు వాగులోగాని పడుతున్నాయి. జనం క్షతగాత్రులవుతున్నారు. ఈ ప్రాంతంలో గతంలో అదుపు తప్పి లోయలో పడిన ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలవ్వగా, ఒకరు మృతి చెందారు. ఈ ప్రాంతానికి ఎదురెదురుగా వాహనాలు వచ్చిన సందర్భంలోనూ పక్కకు తప్పుకునే అవకాశం లేకుండాపోయింది. దీంతో రెండు వాహనాల్లో ఏదో ఒక వాహనం వెనుకకు వెళ్తేనే గానీ మరొక వాహనం ముందుకు వెళ్లే అవకాశం లేదు. అదే విధంగా తాలిపేరు ప్రధాన కాలువపై ఇరిగేషన్ శాఖ వారు 35 యేళ్ల క్రితం నిర్మించిన వంతెనపై నుంచి రాకపోకలు సాగుతుండగా అది కూడా ప్రస్తుతం శిధిలావస్థకు చేరి రెండు వేపులా ఉన్న రెయిలింగ్‌లు పూర్తిగా విరిగిపోయాయి. ఏ వాహనం ఎప్పుడు కాలువలో పడిపోతోందన్న విధంగా అక్కడి పరిస్థితి ఉంది. అదే విధంగా కుర్నపల్లి వరకు ఉన్న రహదారికి పలు చోట్ల ఉన్న మూల మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా ఉన్నాయి.

**సమస్యలు పరిష్కరించేనా..?**

ఈ మార్గంలో ప్రమాదాలను నివారించాలంటే తాలిపేరు ప్రధాన కాలువ కట్టపై ఉన్న ఇరుకు రోడ్డును వెడల్పు చేయాల్సి ఉంది. దానికి రెండువైపుల రైలింగ్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంది. తాలిపేరు కాలువపై శిథిలమైన వంతెన స్థానంలో మళ్లీ నూతనంగా వంతెనను నిర్మించాలి. ఆ వంతెనకూ సరైన రైలింగ్‌లు అమర్చాలి. అదే విధంగా పలుచోట్ల ప్రమాదాలకు నిలయాలుగా ఉన్న మూలమలుపుల్లో ప్రమాదాలు చోటు చేసుకోకుండా రక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంది. ఈ మేరకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక గిరిజనులు కోరుతున్నారు.

### రోడ్డు వెడల్పు చేయాలి



తాలిపేరు కాలువ గట్టుపై నిర్మించిన రహదారిని వెడల్పు చేయాలి. ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు తప్పుకోవడం సాధ్యం కావడం లేదు. ఒక వాహనం వెనుక్కు వెళ్తేనే మరో వాహనం ముందుకు వెళ్లే పరిస్థితి ఉంది. ఈ క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు ఇక్కడ రోడ్డు వెడల్పు చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

– ఎస్.కృష్ణవేణి, కుర్నపల్లి

### నూతన వంతెనను నిర్మించాలి



మూడు దశాబ్దాల క్రితం ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన వంతెనపై నుంచే రాకపోకలు సాగుతున్నాయి. రోడ్డు నిర్మాణం చేసిన తరువాత ఈ మార్గంలో రాకపోకలు ఎక్కువ కావవడంతో వంతెన శిథిలావస్థకు చేరుతోంది. వంతెనకు రెండు వైపులా ఉన్న రెయిలింగ్స్ పూర్తిగా విరిగిపోయాయి. వంతెన నిర్మాణంపై ఆర్‌అండ్‌బీ అధికారులు దృష్టి పెట్టాలి.

– కలుము ఉంగయ్య, కురకట్‌పాడు

# ఓటు నమోదు చేసుకోవాలి




మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

**అన్నపురెడ్డిపల్లి:** 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో 78,79,80 పోలింగ్ బూత్‌లలో నిర్వహించిన ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఓటు నమోదుపై అధికారులకు, బీఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు. పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని కోరారు. తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్, ఆర్ఐ మధు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**అశ్వారావుపేటరూరల్:** ఓటర్ల నమోదు, దరఖాస్తుల స్వీకరణ కోసం నిర్వహించిన ప్రత్యేక శిబిరాలకు విశేష స్పందన లభించింది. ఆదివారం మండలంలోని ఊట్లపల్లి, వినాయకపురం, ఆసుపాక, నారాయణపురం, గుమ్మడవల్లి, పేరాయిగూడెం, అశ్వారావుపేటతోపాటు అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాలను నిర్వహించారు. ఆయా శిబిరాల్లో కొత్త ఓటర్లు, మార్పులు, చేర్పుల కోసం పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. శని, ఆదివారాల్లో నిర్వహించిన ప్రత్యేక శిబిరాల ద్వారా అశ్వారావుపేట మండలంలోని మొత్తం 51 పోలింగ్ కేంద్రాల పరిధిలో సుమారు 720 దరఖాస్తులు స్వీకరించినట్లు వచ్చినట్లు తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు సోమవారం ఆఖరి గడువు పెట్టినట్లు వెల్లడించారు.


# ఎమ్మెల్యే 'పాయం' పర్యటన

**గుండాల:** పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం ఆళ్లపల్లి మండలంలో పర్యటించారు. వివిధ కారణాలతో అనారోగ్యంగా ఉన్న పలువురిని పరామర్శించారు. అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పలు గ్రామాల్లో శుభకార్యాలకు హాజరయ్యారు. స్థానిక గ్రామాల్లో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు రాంనర్సయ్య, ఎస్‌కె.ఖదీర్, అతహార్, పాపారావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



అనారోగ్యంతో ఉన్న వ్యక్తిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పాయం

### హామీల అర్థం తెలుసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు రామనాథం

**పినపాక:** బీఆర్ఎస్ నాయకులు ఉచిత విద్యుత్ హామీ అర్థం తెలియకుండా మాట్లాడుతున్నారని, దాని అర్థం తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రామనాథం హితవుపలికారు. ఆదివారం మండల పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు కాకముందే విమర్శలు చేయడం తగదన్నారు. కరెంటు బిల్లులు కట్టవద్దని కేటీఆర్ మాట్లాడడం సరికాదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఉచిత విద్యుత్, దళితులకు మూడెకరాల భూమి, నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్రూం ఇల్లు వంటి పథకాలు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం మారడంతో మతిభ్రమించి నాయకులు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని చిత్తశుద్ధితో నెరవేరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### ప్రభుత్వ ఆస్పత్రిలో సిజేరియన్

**అశ్వారావుపేటరూరల్:** అత్యవసర పరిస్థితిలో ఓ గర్భిణికి ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో సిజేరియన్ చేసి తల్లి, బిడ్డ ప్రాణాన్ని కాపాడారు. ఆదివారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయ్ కుమార్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండలంలోని జమ్మిగూడేనికి చెందిన ముప్పాళ్ల కృష్ణవేణి రెండో కాన్పు కోసం శనివారం సీహెచ్‌సీ ఆస్పత్రిలో చేరింది. మొదటి కాన్పు సాధారణంగా జరగడంతో ఆస్పత్రి వైద్యులు రెండో కాన్పును సైతం సాధారణ కాన్పు చేసేందుకు యత్నించారు. పురిటి నొప్పులు క్రమంలోనే కడుపులో బిడ్డ ఉమ్మ నీరు తాగి, పేగు మెడకు చుట్టుకుపోయినట్లు గుర్తించారు. దీంతో గర్భిణికి అత్యవసరంగా ఆస్పత్రి ప్రసూతి వైద్యురాలు(గైనకాలజీస్టు) రాధా రుక్మిణి పర్యవేక్షణలో పాల్వంచ నుంచి మత్తువైద్యుడు డాక్టర్ ప్రసాద్‌ను అందుబాటులోకి తీసుకొచ్చి సిజేరియన్ ఆపరేషన్ చేశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.

### పోగొట్టుకున్న ఫోన్ అందజేత

**అశ్వాపురం:** మండల కేంద్రానికి చెందిన తెల్లం పవన్‌కుమార్ ఈ నెల 6న తన మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. సీఈఐఆర్ పోర్టల్‌లో ఆన్‌లైన్ చేయగా.. సీఐ రవీందర్ ఆధ్వర్యంలో మొబైల్‌ఫోన్‌ను గుర్తించారు. ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది ఫోన్‌ను పవన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఈఐఆర్ ఆపరేటర్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా శేషగిరిరావు

**చండ్రుగొండ:** మండల ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా పసుమర్తి శేషగిరిరావును రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆర్యవైశ్యులు ఆదివారం సమావేశమై మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కొదుమూరి జనార్దన్‌రావు, కోశాధికారిగా దూపకుంట్ల రామారావు, ఉపాధ్యక్షుడిగా ఎల్‌పీ రంగారావులను ఎన్నుకున్నారు. సభ్యులుగా కొండా సతీష్, మోటమర్రి కాంతారావు, కంచర్ల కృష్ణప్రసాద్, లగడపాటి నాగేశ్వరరావు, వనమా సత్యనారాయణలను ఎన్నుకున్నారు. గ్రామకమిటీ అధ్యక్షుడిగా సంకా శంకర్, ఉపాధ్యక్షుడిగా పద్మనాభుని కృష్ణారావు, కోశాధికారిగా కుక్కడపు వెంకటేశ్వరరావులు ఎన్నికయ్యారు. ఎన్నికైనవారిని పలువురు అభినందించారు. సంఘం అభివృద్ధికి కృషి చేయాల్సిందిగా కోరారు.

### ఆర్థికసాయం అందజేత

**దుమ్ముగూడెం:** మండలంలోని కొత్తపల్లి గ్రామంలో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఏఎస్‌పీ జాతీయ సలహాదారు కొర్సా వెంకటేశ్వర్లు రూ.15వేలు ఆర్థికసాయం ఆదివారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తు తరాల్లో ఆదివాసుల సమస్యల సమావేశాలకు ఇలాంటి కమ్యూనిటీ భవనాలు చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో కొత్త పల్లి ఉప సర్పంచ్ కొర్స రామచంద్రయ్య, గ్రామ పటేల్ రేసు జానికి రామయ్య, మాజీ సర్పంచ్ రేసు వీరాస్వామి, కల్లూరి ప్రసాద్, రామాచారి, రేసు రాంబాబు పాల్గొన్నారు.

**అగ్నిప్రమాద బాధితుడికి..**

**దుమ్ముగూడెం:** మండల పరిధిలోని మారాయిగూడెం గ్రామంలో విద్యుత్ షార్ట్ షర్క్యూట్‌తో ఇల్లు కాలిపోయిన బాధిత కారం రామకృష్ణ కుటుంబానికి మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిత్యావసరాలను అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొప్పుల మురళి మాట్లాడుతూ.. బాధిత కుటుంబానికి సహాయం చేయడానికి ముందుకు వచ్చిన దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. సీపీఎం మండల కార్యదర్శి కారం పుల్లయ్య పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీరామ శోభాయాత్ర



భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో శోభాయాత్రను నిర్వహిస్తున్న భక్తులు

**బూర్గంపాడు:** అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో సారపాకలో శ్రీరామ శోభాయాత్రను ఆదివారం వైభవంగా నిర్వహించారు. అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా భక్తులు, స్థానికులు పెద్దసంఖ్యలో శోభయాత్రలో పాల్గొన్నారు. శ్రీరామ నామ కీర్తనలు, భజనలతో శోభాయాత్ర సారపాక పుర వీధులలో కొనసాగింది. శోభాయాత్రతో సారపాకలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

**భద్రాచలంటౌన్:** అయోధ్య శ్రీరామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా భద్రాచలం పట్టణంలో భారీ శోభాయాత్రను నిర్వహించారు. విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శోభయాత్రలో శ్రీరాముడి విగ్రహ ప్రతిమతో బిడ్జి సెంటర్ నుంచి చర్ల రోడ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందు పరిషత్ సభ్యులు, ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

**గుండాల:** నేడు అయోధ్యలో నిర్వహించనున్న బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో ద్విచక్రవాహనాలతో రామభక్తులు ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో ఈ ర్యాలీ నిర్వహించారు. జై శ్రీరాం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక రామాలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. సోమవారం స్థానిక రామాలయంలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు.

# చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



కీడా పోటీల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఏఎస్పీ పరితోష్ పంకజ్

**దుమ్ముగూడెం:** ఏజెన్సీలోని యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. ఆదివారం ములకపాడు క్రీడా మైదానంలో దుమ్ముగూడెం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత చెడు మార్గాలవైపు మరలకుండా మంచి గమ్యం వైపు పయనించి తమ జీవితాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. యువత గంజాయి, డ్రగ్స్‌లకు అలవాటు పడవద్దని వాటికి అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. గ్రామాల్లో ఏదైనా సమస్యలు ఉంటే పోలీస్‌ల దృష్టికి తీసుకు వస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. త్వరలోనే మండల క్రీడామైదానం పూర్తి అవుతుందని దీంతో పోలీస్ పరీక్షల్లో పాల్గొనే యువతి, యువకులు ప్రాక్టీస్ చేసుకోవడానికి అవకాశం ఉందని అన్నారు. కార్యక్రమంలో సీఐ దోమల రమేష్, జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, ఎంపీపీ రేసు లక్ష్మి, ఎస్సైలు కేశవరావు,పోటు గణేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లంకా శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారయణమూర్తి, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా పోలీసుల తనిఖీలు



పూసుగుప్ప రోడ్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

**చర్ల:** మండలంలో ఆదివారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రమైన చర్లలో ఆదివారం జరిగే వారపు సంతకు సరిహద్దు ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా, బీజాపూర్, దంతెవాడ జిల్లాల్లోని అటవీ ప్రాంత గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఆదివాసీలు ఈ సంతకు తరలివస్తుండగా వారి మాటున మావోయిస్టులు, మిలిటెంట్లు, మిలీషియా సభ్యులు, కొరియర్లు, సానుభూతిపరులు రావచ్చునన్న అనుమానంతో పోలీసులు తనిఖీలను నిర్వహించారు. ఇందులో భాగంగా చర్లకు వచ్చే ప్రధాన రహదారులైన కుర్నపల్లి, తిప్పాపురం, పూసుగుప్ప రోడ్లలో మోహరించిన సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పార్టీ, సివిల్ పోలీసులు.. ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. అనుమానితులుగా భావించిన పలువురు ఆదివాసీలను అదుపులోకి తీసుకుని విచారించారు. నిర్ధారించుకున్న అనంతరం వారిని విడిచిపెట్టారు. సీఐ బి.రాజగోపాల్ ఆదేశాల మేరకు ఎస్సైలు టీవీఆర్ సూరి, నర్సిరెడ్డి తనిఖీలను నిర్వహించారు.

# లెనిన్‌కు ఘనంగా నివాళి



బూర్గంపాడు: లెనిన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

**బూర్గంపాడు:** విప్లవవాది లెనిన్ శత వర్థంతిని పురస్కరించుకుని ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. సారపాక సుందరయ్యనగర్‌లో లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెట్టుబడిదారి వ్యవస్థను నిర్మూలించడానికి ఆయన చేసిన పోరాటాలను నాయకులు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు, ఎస్‌కె.అబీదా, కనకం వెంకటేశ్వర్లు, ఎండి.హుస్సేన్, కొలురి నాగమణి, కమటం మరియమ్మ, ఆర్.లక్ష్మి, నిమ్మకాయల అనంతలక్ష్మి, ఈర్ల శివచంద్ర తదితరులు పాల్గొన్నారు.

**మణుగూరురూరల్:** కార్మికవర్గ ప్రయోజనాల కోసం ఆర్థిక వాదులపై పోరాటం చేసిన విప్లవ వీరుడు లెనిన్ అని సీపీఎం జిల్లా నాయకులు రేపాకుల శ్రీనివాస్, గద్దల శ్రీనివాస్‌లు అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో లెనిన్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళ్లర్పించారు. అనంతరం వారు మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కొడిశాల రాములు, కార్యదర్శి వర్గ సభ్యులు సత్రపల్లి సాంబశివరావు, దామల్ల లెనిన్‌బాబు, సూర్యనారాయణ, శ్రీకాంత్, దేవేందర్, సందీప్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



దుమ్ముగూడెం: జెడ్పీ స్కూల్‌లో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



దమ్మపేట: ఎమ్మెల్యేకు మెమెంటో అందజేస్తున్న తోటి మిత్రులు

**దమ్మపేట:** ఆశ్రమ పాఠశాల పూర్వపు విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. మండలంలోని ఆర్లపెంట గ్రామ శివారులో పార్కలగండి ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదివిన (1997–98 బ్యాచ్) విద్యార్థులు కలుసుకున్నారు. అదే పాఠశాల, అదే సంవత్సరంలో స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కూడా చదువుకున్నారు. దీంతో ఆయన సమ్మేళనానికి హాజరయ్యారు. విద్యార్థి దశలో గడిపిన మధుర జ్ఞాపకాలను, అలనాటి గురువులను, ఎమ్మెల్యే తోటి మిత్రులతో కలసి స్మరించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రతి ఒక్కరి జీవిత విశేషాలను తెలుపుతూ, ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. అనేక కష్టాలను ఎదుర్కొని, ఎమ్మెల్యేగా విజయం సాధించిన జారేను, తోటి మిత్రులు శాలువాతో సత్కరించి, మెమోంటోను అందజేశారు. అభినందనలు తెలిపారు.

**దుమ్ముగూడెం:** దుమ్ముగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005–06లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాల నావరణలో కలుసుకుని సందడి చేశారు. స్నేహితులంతా ఒకరినొకరు ఆత్మీయ అనుభవాలు పంచుకున్నారు. చిన్న నాటి ఊసులన్నింటినీ గుర్తుకు తెచ్చుకున్నారు. అప్పటి మారుపేర్లతో ఒకరినొకరు పిలుచుకుంటూ నాడు చిలిపి పనులను గుర్తు చేసుకున్నారు. స్నేహభావంతో ఒకరినొకరు మనస్ఫూర్తిగా ఆప్యాయతలు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రామారావు, లక్ష్మణరావు, శ్రీనివాసరావు, కామేశ్వరరావు, సుశీల, సత్యవేణి, రజిని, పద్మ, ఉషారాణి, పద్మ, శాస్త్రి సార్, అటెండర్ రవణమ్మ, విద్యార్థులు రాజేష్, నాగార్జున, లంక శివ, పవన్, నగేష్, సంతోష్, గౌరీ శంకర్, గాయత్రీ, దేవి, సుస్మిత తదితరులు పాల్గొన్నారు.